రోడ్లు ఇలా.. వెళ్లేదెలా..?



గుంతలమయంగా లక్ష్మీవిహార్ ఫేజ్-1 కాలనీ రోడ్డు





దూబే కాలనీలో ప్రధాన రోడ్డు దుస్థితి



అధ్వానంగా నల్లగండ్ల ఆర్‌ఓబీ సర్వీస్ రోడ్డు

శేరిలింగంపల్లి: వర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారాయి. దీనికితోడు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో నాలాల్లోంచి రోడ్లపైకి రావడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. దూబే కాలనీలో ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారడంతో లింగంపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం 1 వైపు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- నల్లగండ్ల ఆర్‌ఓబీ సర్వీస్ రోడ్డు అధ్వానంగా మారింది.
- లక్ష్మీవిహార్ ఫేజ్-1 కాలనీ ఎదురు రోడ్డు గుంతలమయంగా మారింది
- లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి పీజేఆర్ స్టేడియంకు వెళ్లే రోడ్డులో సిటిజన్ కాలనీ వద్ద పలుచోట్ల గుంతలు పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అవగాహనతోనే హెపటైటిస్ నివారణ



స్టార్ ఆస్పత్రి కన్సల్టెంట్ క్లినికల్, ట్రాన్స్‌ప్లాంట్ హెపటాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నేడు ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం

రాయదుర్గం: భారతదేశంలో సుమారు 40 మిలియన్ల మంది దీర్ఘకాలిక హెపటైటిస్ బితో జీవిస్తున్నారని నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రి కన్సల్టెంట్ క్లినికల్ ట్రాన్స్‌ప్లాంట్ హెపటాలజీ డాక్టర్ జి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 'హెపటైటిస్ : దీన్ని ఛేదిద్దాం' అనే థీమ్‌తో 2025లో నిర్వహించుకుంటున్న ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.దీనికి చికిత్స ఉన్నప్పటికీ తీవ్ర సమస్యలు తలెత్తే వరకూ గుర్తించబడదన్నారు. అవగాహన లేకపోవడం లేదా సాధారణ స్క్రీనింగ్ చేయకపోవడం వలన చాలా మందికి ఆలస్యంగా రోగ నిర్ధారణ జరుగుతోందన్నారు. అవగాహనతోనే దీన్ని జయించవచ్చని డా.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రశ్న: హెపటైటిస్ అంటే ఏమిటి ?

జ: హెపటైటిస్ అనేది కాలేయ వాపు. ఇది సాధారణంగా వైరస్ వల్ల వస్తుంది. మద్యం, మందులు లేదా రోగనిరోధక వ్యవస్థ దాడి చేయడం వంటివి కారణాలు కావచ్చు. చికిత్స చేయకుండా వదిలేస్తే కాలేయాన్ని నెమ్మదిగా దెబ్బతీస్తూ చివరికి కాలేయ వైఫల్యం లేదా కాలేయ క్యాన్సర్‌కి దారి తీస్తుంది.

ప్ర: హెపటైటిస్ రావడానికి గల కారణాలు ?

డా: వైరల్ హెపటైటిస్.. అయిదు ప్రధాన రకాల వైరస్‌లు-ఏ,బి,సి,డి,ఈ. ఏ,ఈ కలుషిత ఆహారం లేదా నీటి వల్ల, బి,సి రక్తం, శరీర ద్రవాల ద్వారా, డీ హైపటైటిస్ బి ఉన్నవారికి మాత్రమే వస్తుంది. రెండోది: ఆల్కహాలిక్ హెపటైటిస్.. అధిక మోతాదులో మద్యం వల్ల కాలేయకణాలు దెబ్బతింటాయి, దీర్ఘకాలంలో సిర్రోసిస్‌కి దారితీస్తుంది. మూడోది: నాన్ ఆల్కహాలిక్ స్టీటో హెపటైటిస్ (ఎన్ఏఎస్‌హెచ్), ఆల్కహాల్ తీసుకోని వారిలో ఎక్కువ బరువు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారిలో తరచూ కనిపిస్తుంది. నాల్గోది : ఆటోఇమ్యూన్ హెపటైటిస్ రోగనిరోధక వ్యవస్థ పొరపాటుగా కాలేయాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి చేస్తుంది. మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇక ఐదవదిఫ డ్రగ్ ఇండ్యూస్డ్ హెపటైటిస్.. కొన్ని మందులు, ఆయుర్వేద సప్లిమెంట్లు కాలేయంపై విష ప్రభావం చూపుతాయి.(అధిక డోసు పారాసిటమాల్, టీబీ మందులు, లివ్-52 మొదలైనవి)

ప్ర: హెపటైటిస్ లక్షణాల గురించి..

డా: ముఖ్యంగా అలసట, వికారం, ఆకలి లేకపోవడం, ముదురు మూత్రం, పసుపు రంగు చర్మం /కళ్ళు (జాండీస్), పొత్తికడుపు నొప్పి, జాయింట్ నొప్పులు, చాలా మంది దీర్ఘకాలిక దశ వరకు ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు.

ప్ర: ఎవరు ప్రమాదంలో ఉన్నారు.. . వైరల్ హెపటైటిస్ వచ్చే పరిస్థితులు ?

డా: సూదులు, రేజర్లు పంచుకోవడం, అసురక్షిత లైంగిక చర్య, ఆసుపత్రుల్లో పని, అపరిశుభ్రత ఉండే ప్రదేశాల్లో, పచ్చబొట్లు/కుట్లు, డయాలసిస్‌పై ఉండే రోగులు ఎన్ఏఎస్‌హెచ్, అధిక బరువు, మధుమేహం, కొలెస్ట్రాల్ ఉన్నవారు. ఏఐహెచ్- మహిళలు, ఆటోఇమ్యూన్‌రోగాల కుటుంబ చరిత్ర ఉన్నవారు.డీఐఎల్ఐ- ఎల్ఐవి 52, పారాసిటమాల్, స్టెరాయిడ్స్ వాడేవారు ప్రమాదంలో ఉన్నట్టే.

ప్ర: నివారణ మార్గాలు ..?

డా: హెపటైటిస్ ఏ, బీ టీకాలు వేయించుకోవాలి. వ్యక్తిగత వస్తువులు పంచుకోవద్దు. చేతులు తరచూ కడుక్కోవాలి, పచ్చబొట్లు/కుట్లు వేయించుకునే చోట పరిశుభ్రత ఉండాలి. ఆల్కహాల్ మానుకోవాలి, బరువు తగ్గాలి, షుగర్ నియంత్రణలో ఉంచాలి. హెర్బల్ మందులు తీసుకునే ముందు హెపటాలజిస్టును సంప్రదించాలి. అవగాహన కలిగి ఉండాలి.

యువత స్వయం ఉపాధిని ఎంచుకోవాలి

మియాపూర్: డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో ఆదివారం కార్ కేర్ సర్వీస్ సెంటర్‌ను ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. యువత స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని ఎదగాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్‌రావు, నాయకులు గంగాధర్, ప్రసాద్, శివ, నరేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ఆదరించాలి



మియాపూర్: మియాపూర్‌లోని గ్రేస్ అనాథాశ్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ వృద్ధులకు అల్పాహారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నేడు తల్లిదండ్రులను అనాథాశ్రమాల పాలు చేస్తున్నారని, వారిని ఆదరించాలని సూచించారు కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు శివ రామకృష్ణ, శ్రీను, మల్లేశ్వర్‌రావు, బాలరాజు, నందూరి వెంకటేశ్వర్ రాజు పాల్గొన్నారు.

ఊరపోచమ్మకు పూజలు



రాయదుర్గం: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం రాయదుర్గంలోని శ్యామ్‌లేట్ వీధిలో ఊరపోచమ్మ అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకం, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి ఆదివారం ఆలయంలో స్థానికులతో ప్రత్యేక పూజలను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

గౌలిదొడ్డిలో ఉచిత వైద్యశిబిరం



రాయదుర్గం: ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డిలో సేవాభారతి ఎల్బిహెచ్ గ్రీన్ ల్యాండ్స్ డాక్టర్ ఈశ్వర్‌చందర్ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంను ఆయన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. ప్రతి బస్తీలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని వారు సూచించారు. శిబిరంలో పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్య బృందం పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

పటాన్‌చెరు టౌన్: పెరుగుతున్న కాలుష్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాలలో శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...పర్యావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పటాన్‌చెరు బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ నాగరాజు యాదవ్, శాంతి నగర్, శ్రీనగర్ కాలనీల అధ్యక్షుడు అంజిరెడ్డి, పవన్ కళ్యాణ్ అధ్యక్షుడు సత్యనారాయణ, రాజు, అజ్మత్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన నూతన కమిటీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానందనగర్ డివిజన్‌లోని శాంతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఆదివారం కార్పొరేటర్ మాధవరం రోజాదేవిని కలిశారు. నూతన కమిటీకి కార్పొరేటర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె. శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ ఎస్.ఎల్.ఎన్. రెడ్డి, కోశాధికారి ఏ. కిషోర్, అడ్వైజర్ సత్తయ్య, మాజీ ప్రెసిడెంట్లు మురళీ మోహన్, ఎం. ప్రవీణ్‌కుమార్, మురళీ గౌడ్, కమిటీ సభ్యులు మురళీ కృష్ణ, నవీన్ కుమార్, నరసింహాచారి, మహేష్, ప్రవీణ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'భాగవతం' ప్రారంభం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పరశురాముని ఆలయంలో ఆదివారం నుంచి వారం రోజులపాటు భాగవతం ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రోజు 3 నుంచి సాయంత్రం 6:30 వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నుండి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్లే ఆర్అండ్ బీ రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు జిల్లా అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం శ్రామిక్ భవన్‌లో జరిగిన పార్టీ సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ... ప్రస్తుతం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం మీదుగా వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్లో భారీ గుంతలు ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలు కురుస్తుండడంతో గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. నిత్యం లాది మంది ఈ రహదారి నుండే ప్రయాణిస్తుంటారని అన్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శాంతకుమార్, పెంటయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 50, పచ్చిమిర్చి 70 , బెండ 50, కాకర 50, దొండ 35, దోస 35, ఆలు 30, చామ 50, కీర 40, బీర 40, వంకాయ 35, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 25, క్యారెట్ 55, చిక్కుడు 70, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 100, వెల్లుల్లి 150.

నేడు అన్నదానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు టోల్ గేట్ సమీపంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో శ్రావణ సోమవారంను పురస్కరించుకొని స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సోమవారం ఉదయం 5:30 నుండి 7:00 వరకు పార్వతి రామలింగేశ్వరస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అన్నదానం జరుగుతుందని తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి .. దుర్గం చెరువులో శవమై తేలాడు..



దుర్గాప్రసాద్ (ఫైల్)

మాదాపూర్: అదృశ్యమైన వ్యక్తి మాదాపూర్ దుర్గం చెరువులో శవమై తేలిన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. సైనిక్‌పురిలో ఈవెంట్స్ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ (36) ఈనెల 26వ తేదీ నుంచి కనపడడం లేదని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో దుర్గాప్రసాద్ శవం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

నిరసన..173వ రోజు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు 173వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం శిబిరంలో స్థానిక మహిళలు పాల్గొని నిరసన తెలిపారు. ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటును విరమించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు.

నానక్‌రాంగూడలో 'మన్‌కీ బాత్'



రాయదుర్గం: భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రత్యేకంగా నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని బీజేపీ గచ్చిబౌలి డివిజన్ నాయకులు ఆదివారం తిలకించారు. నానక్‌రాంగూడలోని బీజేపీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్ ఆధ్వర్యంలో నాయకులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. గచ్చిబౌలి డివిజన్‌లో పార్టీని తిరుగులేని శక్తిగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వరలక్ష్మీధీరజ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సంజీవ, బబ్లూసింగ్, సురేందర్, దినేష్‌యాదవ్, ఉమేష్‌గౌడ్, అనంత్ రెడ్డి, విఠల్, హర్పాల్‌సింగ్, కవిత, అనవరి, హేమ నళిని, సుజాత, చంద్రకళ పాల్గొన్నారు.

10న శ్రావణ బోనాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ ఐదుగుళ్ల పోచమ్మ బోనాల నిర్వహణకు ఆదివారం ఆలయ కమిటీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, కార్పొరేటర్ బి.పుష్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 10వ తేదీ శ్రావణ బోనాలను ఐదుగుళ్ల పోచమ్మ తల్లి ఆలయంలో జరిపేందుకు నిర్ణయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు కార్పొరేటర్ పుష్ప తెలిపారు.

వరద... తప్పని బురద

- కాల్వ పనుల్లో తీవ్ర జాప్యం.. నిలిచిపోయిన రాకపోకలు
- ఇబ్బందులుపడుతున్న వాహనదారులు, స్థానికులు



ఎంఏనగర్ కాలనీ- శాంతినగర్ కాలనీ రోడ్డులో జరుగుతున్న వరదనీటి కాల్వ పనులు

మియాపూర్: వరదనీటి కాల్వ పనుల్లో జాప్యం ప్రజల పాలిట శాపంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు సాగుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 3 నెలల ముందు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు సాగుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

- మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎంఏనగర్ కాలనీ నుండి శాంతినగర్ రోడ్డులో చేపట్టిన వరదనీటి కాల్వ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులకు మూడు నెలల ముందు శంకుస్థాపన చేశారు. పనుల ప్రారంభించడంలో ఆలస్యం కావడంతో వర్షాకాలం సమీపించిన క్రమంలో నిర్మాణ పనులను ప్రారంభించారు.
- వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పనులు ఆగిపోయాయి. పనులు చేపట్టిన నాటి నుండి ఆలస్యం అవుతుందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- కాల్వ పనుల నిమిత్తం రోడ్డు తవ్వి కొంతమేర పనులను చేపట్టారు. ఆ రోడ్డు వెంబడి మట్టి కుప్పలు వేశారు. దీనికితోడు రోడ్డంతా మురుగు నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- జాతీయ రహదారిపై ట్రాఫిక్ కారణంగా చందానగర్, దీప్తిశ్రీనగర్, పీజేఆర్ ఎన్క్లేవ్ కాలనీల నుండి బొల్లారం, బాచుపల్లి వైపు వెళ్లే ఉద్యోగులు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇతర పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. మురుగు సమస్యతో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి.
- వరదనీటి కాల్వ పనులు చేపట్టిన రోడ్డు వెంబడి రెండు అపార్ట్‌మెంట్‌లు, పాఠశాలలున్నాయి. అపార్ట్‌మెంట్లవాసులు, విద్యార్థులు ఈ మురుగునీటిలో నుండే రాకపోకలు చేస్తున్నారు.
- శాంతినగర్ కాలనీ ప్రధాన రహదారిపై సీసీ రోడ్డు పనుల కోసం తవ్వి వదిలేయడంతో పాటు వరదనీటి పనులు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వరదనీటి కాల్వ పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





పాఠశాల, అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లేందుకు మట్టి సంచులతో దారి ఏర్పాటు చేసుకున్న దృశ్యం



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

కూలిన భారీ వృక్షం

తొలగించిన హైడ్రా, డీఆర్ఎఫ్ సిబ్బంది

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ మానస అపార్టుమెంట్ ప్రధాన గేటు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ఉదయం పూట రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడ్డారు. అంతేకాకుండా వాహనం సైతం ధ్వంసమైంది. దీంతో స్థానికులు హైడ్రా, డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని కూలిన భారీ చెట్టును తొలగించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



బీరప్ప స్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మించిన బీరప్ప స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆలయ నిర్మాణానికి పది లక్షల రూపాయల విరాళం అందించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, దశరథరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.